04.06.2026
గురువారం
www.bestvoicenews.com
bestvoice

# బెస్ట్ వాయిస్
తెలుగు దినపత్రిక

సంపుటి:10 | సంచిక : 345 | వెల:రూ 1/- వరంగల్ ఎడిటర్: కె.మోహన్‌రావు పేజీలు 06

# భూముల విలువకు రెక్కలు



- భూముల మార్కెట్ విలువల సవరణ
- అధిక ప్రాంతాల్లో 50-100 శాతం పెంపుదల
- నేడు రిజిస్ట్రేషన్లశాఖ పోర్టల్‌లో వివరాలు..
- రేపటి నుంచి కొత్త ధరల వర్తింపు

రాష్ట్రంలో హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో భూములు, ప్లాట్లు, అపార్టుమెంట్ల కొత్త మార్కెట్ విలువలను ప్రభుత్వం ఖరారు చేసింది. క్షేత్రస్థాయిలో లోతైన అధ్యయనం నిర్వహించి.. ప్రస్తుత మార్కెట్ విలువలు, అక్కడి వాస్తవ పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, గ్రోత్ కారిడార్లను పరిగణనలోకి తీసుకుంటూ తాజాగా ప్రభుత్వం మార్కెట్ విలువలను సవరించింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ 92,000 ప్రాంతాల్లో మదింపు చేపట్టింది.

బెస్ట్‌వాయిస్, స్టేట్‌బ్యూరో:
ప్రభుత్వం ఆమోదించిన కొత్త విలువలను అధికారికంగా గురువారం ఈ శాఖ పోర్టల్‌లో అప్‌డేట్ చేయనుంది. శుక్రవారం నుంచి పెరిగిన మార్కెట్ విలువలు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భూముల విలువలను పెంచగా కొన్నిచోట్ల పాత ధరలనే ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. పలుచోట్ల భూముల విలువ 50 నుంచి 100 శాతం వరకు పెంచినట్లు తెలిసింది. ఇప్పటికే అధిక విలువలున్నచోట పెంచలేదు. ప్రభుత్వ విలువ తక్కువగా.. బహిరంగ మార్కెట్ ధర ఎక్కువగా ఉన్నచోట్ల నూరుశాతం వరకు పెంచినట్లు సమాచారం. భూముల విలువ సవరణ ద్వారా ప్రభుత్వానికి గరిష్ఠంగా సాలీనా రూ.1,200 కోట్ల వరకు రాబడి పెరుగుతుందని అంచనా. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి శివారు ప్రాంతాల్లో పలుచోట్ల వేగంగా అభివృద్ధి జరుగుతున్నా.. బహుళ అంతస్తుల నిర్మాణాలు వచ్చినప్పటికీ.. భూముల విలువలు తక్కువగా ఉన్నట్లు గుర్తించడంతో అలాంటి ప్రాంతాల్లో కొత్త విలువలను ప్రభుత్వం నిర్ణయించింది. నగర శివారు ప్రాంతాల్లో కొన్నిచోట్ల చదరపు గజం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతున్నా.. మార్కెట్ ధర రూ.1215 వేల లోపు ఉంటోంది. ఇలాంటి ప్రాంతాల్లో ప్రభుత్వం మార్కెట్ విలువలు పెంచుతున్నట్లు సమాచారం. కొన్నిచోట్ల మాత్రం ప్రస్తుత విలువలు ఎక్కువగా ఉండటంతో ధరలు పెంచలేదు. ఇటీవల జీహెచ్ఎంసీలో విలీనమైన ఓ గ్రామంలో ప్రస్తుతం మార్కెట్ విలువ చదరపు గజం రూ.2,100 ఉంటే.. ఆ మొత్తం రూ.4,200 వరకు పెంచారు. 'క్యూర్' పరిధిలో భూముల విలువలు 25 నుంచి 75 శాతం,

మిగతా5లో..



## ఏడాదికి రెండుసార్లు టెట్

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ఏడాదికి రెండుసార్లు టెట్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడంతో ఉపాధ్యాయుల్లో ఊరట నెలకొంది. ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యోగితారాణి పేరుతో విడుదలైన మెమోపై ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు హర్షం వ్యక్తం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించడం తప్పనిసరి అని స్పష్టం చేయడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఎన్నికల విధులు, సర్వేలు, విద్యాశాఖ పనులతో బిజీగా ఉండటంతో టెట్‌కు సిద్ధం కావడం కష్టంగా మారిందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్, అర్హత మార్కుల సడలింపు, భాషా ఉపాధ్యాయులకు సంబంధిత సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయుల సేవా అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

# తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..

- ఈ దేశంలో ఏ నాయకుడైనా పార్టీ పెట్టవచ్చు
- జనసేన కొత్తగా పోటీ చేసేదేముంది?
- కచ్చితంగా తెలంగాణ భూమిపుత్రుల జాగీరే
- దేశభక్తి గురించి పవన్ కళ్యాణ్ నేర్పాల్సిన అవసరం లేదు

బెస్ట్‌వాయిస్, స్టేట్‌బ్యూరో:
జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. దేశంలో ఎవరికైనా పార్టీ పెట్టే హక్కు ఉందని, ఎక్కడైనా ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ ఉందని చెప్పిన ఆయన.. ఏ ప్రాంతంలో రాజకీయాలు చేయాలనుకుంటే ఆ ప్రాంత చరిత్ర, పోరాటాలు, ప్రజల భావోద్వేగాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ గతంలో (2023) కూడా తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేశారని, ఆయనను ఎవరూ అడ్డుకోలేదని గుర్తు చేశారు. గత పన్నెండేళ్లలోనో ఆయనకు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున రాజకీయ సభ నిర్వహించాల్సిన అవసరం పవన్‌కు ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రాంతీయవాదం గురించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'మద్రాస్ రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ దీక్ష కూడా ప్రాంతీయవాదమేనా?. తెలంగాణ ఉద్యమం కూడా ప్రజల ఆకాంక్షల కోసం జరిగిన పోరాటమే. దానిని తప్పుగా చిత్రీకరించడం సరికాదు. దేశభక్తి విషయంలో మాకు ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పరిశ్రమలు గుజరాత్‌కు

మిగతా5లో..





కొడగాని మోహన్‌రావు
-ఎడిటర్
99633 34550



# రాహుల్ మృతి పట్ల సమ్మి గౌడ్ దిగ్భ్రాంతి

బెస్ట్ వాయిస్,తొర్రూరు:

కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నూకల రాహుల్ అనే యువకుడు లారీ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషాదకర వార్త తెలుసుకున్న సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ మృతుడి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మి గౌడ్ మాట్లాడుతూ... రాహుల్ బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులతో భువనగిరిలో స్థిరపడ్డారని, విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో మరణించడం చాలా బాధాకరమని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని, అదేవిధంగా జిల్లా ఎస్పీతో పాటు ఉన్నత అధికారులను కలిసి పూర్తిస్థాయి విచారణ జరిగే వరకు తమ వంతు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



# బాధిత కుటుంబానికి 'జక్కా' పరామర్శ

బెస్ట్ వాయిస్,తొర్రూరు

తొర్రూరు మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన అత్తిల్లి రాము ఇటీవల వడదెబ్బతో మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల నాయకులు, మడిపల్లి మాజీ ఎంపీటీసీ జక్కా మహబూబ్ రెడ్డి మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.3,000 నగదు, 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిల సహకారంతో అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అమ్మాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూతగాదా లో తమ్ముడి పై హత్యాయత్నానికి పాల్పడ్డ అన్న

- హత్యాయత్నం కేసును ఛేదించిన పాలకుర్తి పోలీసులు
- నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలింపు



బెస్ట్ వాయిస్,పాలకుర్తి:

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ పరిసర ప్రాంతంలో గత నెల మే 27 న సాయంత్రం తీగల ధర్మారావు పై హత్యాయత్నం జరిగిన సంఘటన పాలకుర్తి చుట్టూపక్కల ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భూతగాదా విషయంలో తమ్ముడిపై కత్తులతో దాడి చేయించిన అన్న ప్రధాన సూత్రధారి తీగల కిషన్ రావు అతని కుమారుడు తీగల కిరణ్ కుమార్ లు ఈ కేసులో ప్రధాన నిందితులని బాధితుడి భార్య తీగల మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో నమోదైన క్రైమ్ నెంబర్ 125/2026 సెక్షన్ 109.1 బి.ఎన్.ఎస్ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భూ వివాదం నేపథ్యంలో సిఫారి ఇచ్చి హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను పూర్తి దర్యాప్తుతో పోలీసులు కేసులు చేదించి అరెస్టు చేసి బుధవారం మీడియా ప్రవేశపెట్టారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళ్తే పాలకుర్తి మండలం శాతపురం గ్రామానికి చెందిన తీగల కిషన్ రావు తీగల ధర్మారావు అన్నదమ్ముల మధ్య భూమి విషయంలో గత కొంతకాలంగా వివాదాలు జరుగుతున్నాయి. తమ్ముడు ధర్మారావు గత కొంతకాలంగా పాలకుర్తిలో జీవనం సాగిస్తున్నారు. స్టేషన్ఘన్పూర్ మండల కేంద్రంలో ఎస్బిఐ మినీ బ్యాంకు ను భార్యతో కలిసి నడిపిస్తూ పాలకుర్తి కి బస్సులో రోజు వచ్చి వెళుతుంటాడు. భూ విభాగాల నేపథ్యంలో తమ్ముడిని ఎలాగైనా హత్య చేసి ఆస్తిని దక్కించుకోవాలని ఉద్దేశంతోఇదే అదనుగా భావించిన అన్న తీగల కిషన్ రావు తన కుమారుడు తీగల కిరణ్ తో కలిసి తమ్ముడిని హతమార్చాలని పన్నాగం పన్నాడు .ఈ క్రమంలో కిరణ్ హైదరాబాదు కు చెందిన తన స్నేహితుడు తూమల గీతేశ్వర్ సహాయంతో రూపాయలు 15 లక్షలకు సుఫారి ఒప్పందం కుదుర్చుకొని గీతేశ్వర్ ద్వారా ఫోను అభిషేక్ ద్వారా హత్య చేయించేందుకు ఒప్పించారు. సోను తనకు తెలిసిన సంజయ్ శ్రీకాంత్ హర్షితులను కలుపుకొని బాధితుడి కదలికలపై మే నెలలో మూడుసార్లు రెక్కీ నిర్వహించారు. అనంతరం అడ్వాన్సుగా 25000 రూపాయలు సోను తీసుకున్నాడు. అలాగే ఘూరిటీ కింద తీగల కిరణ్ ల్యాండ్ డాక్యుమెంట్స్ ఖాళీ చెక్కులు కాళీ బాండ్ పేపర్లు గీతేశ్వర్ కు ఇచ్చారు. సోను సంజయ్ శ్రీకాంత్ హర్షిత్ లు మే 27 అద్దె కారులో హైదరాబాదు నుండి స్టేషన్ఘన్పూర్ కు వెళ్లి బాధితుడిని హత్య చేయడానికి ప్రయత్నించినప్పటికీ అవకాశం దొరకలేదు. దీంతో పాలకుర్తికి చేరుకొని బస్టాండ్ ప్రాంతంలో కాపు కాసి నడుచుకుంటూ వెళుతున్న ధర్మారావు పై కత్తితో దాడి చేసి అత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డిసిపి రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షణలో 8 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృతంగా దర్యాప్తు చేపట్టగా నిందితులను గుర్తించి అరెస్టు చేయడం జరిగింది. నిందితులనుండి కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. నేరస్తుల నుండి ఒక కారు భూమి పత్రాలు చెక్కులు బాండ్ పేపర్లు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏ 1 గా తీగల కిరణ్ కుమార్ ఏ 2 గా తీగల కిషన్ రావు ఏ3 గా తూముల గీతేశ్వర్ ఏ 4 గా సోను అభిషేక్ పరారీలో ఉన్నాడు. ఇతని అరెస్టు కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాం ఏ 5 గా ధ్యాప సంజయ్ కుమార్ ఏ6 గా కనఫ్ శ్రీకాంత్ ఏ7గా వేముల హర్షిత్ ఉన్నారు. ఈ కేసును చేదించడంలో విశేష కృషి చేసిన రాజ మహేంద్ర నాయక్ పాలకుర్తి సీఐ వి జానకిరామ్ రెడ్డి వర్ధన పేట సిఐ శ్రీనివాస్ పాలకుర్తి ఎస్సై పవన్ కుమార్ దేవరుప్పుల ఎస్సై కొడకండ్ల ఐడి అసిస్టెంట్ అనాలసిస్ట్ సల్మాన్ హెడ్ కానిస్టేబుల్ సోమిరెడ్డి పిసీలు రమేష్ రాజ్ కుమార్ రవి సురేష్ యాకయ్య ప్రశాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వానకొండయ్య గుట్టపై మైనింగ్ పనులను ఆపాలి లేదంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మరో ఉద్యమం తప్పదు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



బెస్ట్ వాయిస్,జనగామ:

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం లకావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీ వానకొండయ్య లక్ష్మి నరసింహ స్వామి స్వయాన కొలువైన క్షేత్రం మైనింగ్ మాఫియా చేతిలో పడి ఉనికి కోల్పోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూను దేవరుప్పుల మండల బిఆర్ఎస్ బృందంతో కలిసి ఆ మైనింగ్ పనులు అడ్డుకునేందుకు ఇచ్చిన నోటీసులకు సమాధానం తెలిపి ఎట్టి పరిస్థితుల్లో మైనింగ్ జరగకుండా చూడాలని ఎర్రబెల్లి దయాకర్ రావు కలెక్టర్ ను కోరారు. గుట్ట వద్ద మైనింగ్ పనులు జరుగుతే అ దేవాలయం ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పనులను ఆపి దేవస్థానం యొక్క మనుగడను కాపాడి 2 కోట్ల రూపాయలతో దేవాలయ అభివృద్ధి పనులు చేపట్టామని మళ్లీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల అ యొక్క పనులను మొదలు పెట్టారని ఆనాడు కూడా ఈ మైనింగ్ వాళ్లు ఆన్ లైన్ లో పర్మిషన్ తెచ్చుకుంటే గ్రామ తీర్మానం లేదని దేవుడి గుట్ట ఉనికి దెబ్బ తింటుందని ఆపింది మేము అని అన్నారు. అధికారంలోకి వచ్చిన వీళ్లు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని గుట్ట వద్దకు బిఆర్ఎస్ నాయకులు వెళ్లి పనులను అడ్డుకోవడానికి వెళ్తే మా నాయకుల మీద కేసులు పెట్టి నోటీసులు పంపించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని నేడు ఆ నోటీసులకు జనగామ జిల్లా కలెక్టర్ కి జవాబు ఇవ్వడం జరిగిందని ఆ మైనింగ్ వాళ్ళని కూడా విచారించగా వారు కూడా మాకు గ్రామ పంచాయతీ తీర్మానం ఆనాడు లేదు ఈనాడు లేదు అని ఏది ఏమైనా ఈ ప్రభుత్వం వానకొండయ్య గుట్ట మైనింగ్ పనులు ఆపకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్యర్యంలో ఉద్యమం చేపడతామని వీటితో పాటు పాలకుర్తి కొడకండ్ల దేవరుప్పుల మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వం తొందరగా కొనుగోలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి దేవరుప్పుల మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధారావత్ రాంసింగ్ నాయక్ మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్ సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ మండల బిఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రతినిధులు యువజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వేములపల్లి మండల టీయూ డబ్ల్యూజే-ఐజేయు నూతన కార్యవర్గం ఎన్నిక

- **మండలఅధ్యక్షుడిగా షేక్ మౌలాలి,ప్రధానకార్యదర్శి:తండు వెంకటేశ్వర్లు,కోశాధికారి: ముండ్ల కళ్యాణ్ యాదవ్,**

బెస్ట్ వాయిస్,వేములపల్లి:

నకిరేకల్ పట్టణంలోని వినాయక బ్యాంక్వెట్ హాల్ లోజరిగినటీయూడబ్ల్యూజే ఐజేయు నల్లగొండ జిల్లామహా సభలో వేములపల్లి మండల నూతనకార్యవర్గాన్నిఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈఎన్నికల ప్రక్రియను రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ,ప్రధానకార్య దర్శి రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణా రెడ్డి, ప్రధానకార్యదర్శికలిమేల నాగయ్య పర్యవేక్షించారు. వేములపల్లిమండలంనూతన సారథులనుజిల్లా మహాసభలోఅధికారికంగాప్రకటించారు.

**నూతన ఎన్నికైనమండల కార్యవర్గం**

వేములపల్లి మండల అధ్యక్షుడు:షేక్ మౌలాలి, ప్రధాన కార్యదర్శి:తండు వెంకటేశ్వర్లు,కోశాధికారి ముండ్ల కళ్యాణ్ యాదవ్,ఉపాధ్యక్షులు వంగాల వెంకటేష్,పుట్టల నాగయ్య, ప్రధాన కార్యదర్శి తండు వెంకటేశ్వర్లు,సహాయ కార్యదర్శులు హరిప్రసాద్, ముండ్ల లింగయ్య యాదవ్, లు ఏకగ్రీవంగాఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు షేక్ మౌలాలి మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. టియూడబ్ల్యూజే ఐజేయు యూనియన్ ను మరింత బలోపేతంచేస్తూ,క్షేత్రస్థాయిలోవిలేకరులుఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిరంతరం పోరాడతామని ఆయన పేర్కొన్నారు.కాలాతీతమవుతున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని,యూనియన్ అండదండలతో ప్రతి జర్నలిస్టుకుభరోసాకల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు,యూనియన్ నాయకులు పాల్గొని నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గానికి కార్యవర్గానికి అభినందనలుతెలియజేశారు.

# మల్లారెడ్డిపల్లిలో ఘనంగా బడిబాట గ్రామసభ

బెస్ట్ వాయిస్,హాసన్ పర్తి:




మల్లారెడ్డిపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ ఘనంగా జరిగింది.ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు రేగ కాంతారావు అధ్యక్షత వహించగా,గ్రామ సర్పంచ్ గాజు కృష్ణవేణి యుగేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ భాగస్వాములై విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలని కోరారు. “ఊరు మనది - బడి మనది” అనే భావనతో గ్రామంలోని పిల్లలను స్థానిక పాఠశాలకే పంపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం గ్రామస్థుల సహకారం అవసరమని పేర్కొన్నారు.పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించిన సర్పంచ్, ఉత్తీర్ణులైన విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. అలాగే ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని బోల్ల ఐశ్వర్యకు రూ.1,000, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థిని పస్తం జ్యోతికి రూ.500 నగదు పారితోషికం అందజేశారు. సుమారు 150 మందికి పైగా గ్రామస్థులు హాజరైన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమారస్వామి, వార్డు సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ యుగేందర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరంజ్యోతి, పాఠశాల శ్రేయోభిలాషి చిరంజీవి, యువజన సంఘాల ప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# టియుడబ్ల్యూజే నూతన కార్యవర్గం ఎన్నిక

బెస్ట్ వాయిస్,మాడ్గులపల్లి:




నకిరేకల్ పట్టణంలోని వినాయక బ్యాంక్వెట్ హాలులో జరిగిన టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభలో మాడ్గులపల్లి మండలం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర అధ్యక్షుడు వీరహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ సమక్షంలో ప్రకటించారు టీయూడబ్ల్యూజే ఐజేయు నూతన సారథులను అధికారికంగా ప్రకటించారు. మాడ్గులపల్లి మండల అధ్యక్షుడు షేక్ రసూల్. ప్రధాన కార్యదర్శిగాదర్శనం రాంబాబు, కోశాధికారిగా చిట్యాల సైదులు, తోపాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు షేక్ రసూ ల్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. యూనియన్ ను మరింత బలోపేతం చేస్తూ, క్షేత్రస్థాయి లోవిలేకరులుఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిరంతరం పోరాడతామని ఆయన పేర్కొన్నారు. కాలాతీతమవుతున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని, యూనియన్ అండదండలతో ప్రతి జర్నలిస్టుకు భరోసా కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, లేఖరులు అభినందనలు తెలియజేశారు.

# వడదెబ్బకు వృద్ధుడు బలి

- **పొలంలో పని చేస్తుండగా అస్వస్థత.. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి**

బెస్ట్ వాయిస్, చిట్యాల



జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన మాశబోయిన రాజయ్య (65) అనే వృద్ధుడు వడదెబ్బ తగిలి బుధవారం మృతి చెందినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే, రాజయ్య చల్లగరిగ గ్రామ శివారులో కౌలుకు తీసుకున్న పొలంలో మక్కజొన్న చొప్ప కల పెట్టేందుకు వెళ్లాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురై, సమీపంలోని చెట్టు కింద స్పృహ తప్పి పడిపోయాడు. దీనిని గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులు రాజయ్యను చికిత్స నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే ఆయన మృతి చెందాడు. మృతుడి కుమారుడు మాశబోయిన రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ వెల్లడించారు.

# కుటుంబ కలహాలతో మనస్తాపం.. పురుగుల మందు సేవించి వివాహిత మృతి

బెస్ట్ వాయిస్, చిట్యాల

కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన ఓ వివాహిత పురుగుల మందు సేవించి మృతి చెందిన ఘటన చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామానికి చెందిన బోంత రాములు కుమార్తె గొల్లెన లక్ష్మి (25)కు 2016 సంవత్సరంలో రేగొండ మండలం రేపక గ్రామానికి చెందిన గొల్లెన హరితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు (8), ఒక కుమార్తె (6) ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ కుటుంబ కలహాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం (జూన్ 2) మధ్యాహ్నం భర్తతో జరిగిన గొడవ అనంతరం తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మి, చిట్యాలలో నివసిస్తున్న తన మేనమామ ఓర్సు రాజయ్య ఇంటికి వచ్చింది. అనంతరం చిట్యాల గ్రామానికి చెందిన అల్లం తిరుపతి ఎడ్లకొట్టం వద్ద పురుగుల మందు సేవించింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిసింది. మృతురాలి తండ్రి బోంత రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు.



# ఉచిత వైద్య శిబిరం

బెస్ట్ వాయిస్ ,ఆత్మకూర్ :

ఆత్మకూరు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కె స్పందన సూచనల మేరకు ఆత్మకూరు మండల కేంద్రంలోని చౌళ్లపల్లి గ్రామం నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ గ్రామంలో డెంగీ పాజిటివ్ కేసు వచ్చినందున జిల్లా అధికారుల ఆదేశానుసారం మెడికల్ క్యాంపు కండక్ట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓపి 46 మంది పేషెంట్లను చూడగా బీపీ 21, షుగర్ 9, జనరల్ ఫీవర్ 2, మలేరియా డెంగు పరీక్షలు నిర్వహించడం జరిగింది. 50 హౌసెస్ హౌస్ టూ హౌస్ ఫీవర్ సర్వే చేయడం జరిగింది.ఫ్రైడే, డ్రైడే ఆక్టివిటీస్ (మురుగు నీరు నిలువ ఉండకూడా చేయడం) చుట్టూ ప్రక్కన పైరాత్రమ్ స్ప్రే చేయడం ఆరోగ్య సూత్రాల గురించి అవగాహనా కల్పించడం జరిగింది. గ్రామ సర్పంచ్ మోరే రాజు, డాక్టర్ నర్సింగరావు, సి హెచ్ ఓ జూనేది, హెల్త్ అసిస్టెంట్లు ఎ సాంబయ్య, పి అనిల్ కుమార్, ఏఎన్ఎం లక్ష్మి, ఆశలు రజిత, సుభద్ర, గ్రామ కార్యదర్శి కే సతీష్, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆత్మకూరు పోలీసులకు ఘన సన్మానం

**▶ 24 గంటల్లో చోరీ కేసు ఛేదించిన పోలీసుల సేవలకు ప్రశంసలు**

బెస్ట్ వాయిస్, ఆత్మకూరు :

కొద్ది రోజుల క్రితం ఆత్మకూరు మండలంలోని గూడెపాడు గ్రామంలో ఉన్న శ్రీ ఆనంద రామాలయంలో జరిగిన చోరీ ఘటనను కేవలం 24 గంటల్లోనే ఛేదించి, చోరీకి గురైన వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసిన ఆత్మకూరు సిఐ సంతోష్, ఎస్సై తిరుపతి, పోలీసులను శ్రీ ఆనంద రామాలయ కమిటీ ఘనంగా సన్మానించింది. బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కేశవమూర్తి ఆధ్వర్యంలో ఆత్మకూరు సీఐ ఆర్ సంతోష్ తో పాటు కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులను శాలువాలతో సత్కరించి, శ్రీరాముని చిత్రపటాలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఆలయంలో జరిగిన చోరీ ఘటన భక్తులను ఆందోళనకు గురిచేసిందని, అయితే ఆత్మకూరు పోలీసులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించి తక్కువ సమయంలోనే కేసును ఛేదించడం అభినందనీయమని పేర్కొన్నారు. నిందితులను పట్టుకొని చోరీకి గురైన వస్తువులను తిరిగి స్వాధీనం చేసుకోవడం ద్వారా భక్తుల్లో విశ్వాసాన్ని పెంపొందించారని కొనియాడారు. అర్చకులు ఆరుట్ల కేశవమూర్తి మాట్లాడుతూ, ఆలయ ఆస్తుల పరిరక్షణలో పోలీసులు చూపిన కృషి ప్రశంసనీయమని, వారి సేవలను గుర్తిస్తూ ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సీఐ సంతోష్, ఎస్సై తిరుపతి మాట్లాడుతూ, ప్రజల సహకారంతోనే నేరాలను త్వరితగతిన ఛేదించగలుగుతున్నామని, ఆలయాలు సహా ప్రజా ఆస్తుల రక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# టింబర్ డిపో బాధితుని ఆదుకుంటాం

**▶ దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ**

బెస్ట్ వాయిస్ ఆత్మకూర్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో టింబర్ డిపోకు నిప్పంటుకొని నష్టపోయిన మహమ్మద్ బాబు మియా (చిరు )ను ఆదుకుంటామని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ భరోసా ఇచ్చారు. బుధవారం సాయంత్రం హనుమకొండ లోని మంత్రి నివాసంలో ఆత్మకూరు మండలంలోని గూడెపాడు కు చెందిన మహమ్మద్ బాబు మియా( చిరు )కలిసి టింబర్ డిపోకు నిప్పంటుకున్న విషయం నష్టపోయిన వివరాలను మంత్రి కొండ సురేఖకు తెలియజేశారు. వెంటనే స్పందించిన మంత్రి కొండ సురేఖ అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.






# భూ తగాదాల్లో సెటిల్‌మెంట్లు చేసేవారికి కౌన్సిలింగ్ ఇవ్వాలి

**▶ రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగించాలి: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

భూ తగాదాల కేసుల్లో అక్రమంగా జోక్యం చేసుకుంటూ మధ్యవర్తిత్వం పేరుతో సెటిల్‌మెంట్లకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాంటి రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కేయూసీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్ స్టేషన్ పనితీరు, రికార్డులు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ఏసీపీ నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి కమిషనర్‌కు స్వాగతం పలికారు. స్టేషన్ సందర్శనలో భాగంగా పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టోర్ రూమ్, కేసు ప్రాపర్టీ గదులు, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల నిల్వ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని సందర్శించి అక్కడి సదుపాయాలను పరిశీలించారు.
అనంతరం స్టేషన్‌కు సంబంధించిన పరిపాలనా రికార్డులు, నేరాల నమోదు వివరాలు, రౌడీ షీటర్లు, అనుమానితుల జాబితాలు, పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్లు ఎవరెవరు, వారి ప్రస్తుత కార్యకలాపాలు ఏమిటి, గతంలో నమోదైన కేసుల పరిస్థితి ఎలా ఉంది అనే అంశాలపై ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలను బెదిరిస్తూ భూ తగాదాలు, ఆస్తి వివాదాలు, ఇతర వ్యక్తిగత సమస్యల్లో జోక్యం చేసుకుని అక్రమ సెటిల్‌మెంట్లకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాంటి వ్యక్తులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి చట్టబద్ధమైన మార్గాల్లో సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేయాలని అన్నారు. రౌడీ షీటర్ల పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్న కమిషనర్, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సామాజిక సమస్యలను గుర్తించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని విద్యాసంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత వంటి అంశాలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. లాగే ప్రతి ఎస్ఐ తనకు కేటాయించిన సెక్టార్ పరిధిలో నిరంతరం పర్యటిస్తూ స్థానిక పరిస్థితులను తెలుసుకోవాలని, నేరాల నివారణకు అవసరమైన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో సమాచార సేకరణ కీలకమని, ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడం ద్వారా సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్ కుమార్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ సందర్శనతో స్టేషన్ సిబ్బందిలో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలనే చైతన్యం పెరిగిందని అధికారులు తెలిపారు.



# ప్రజా పాలన పాటల పుస్తక కవర్‌ను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

బెస్ట్ వాయిస్,వరంగల్:

వరంగల్ జిల్లా సాంస్కృతిక సేనా ఆధ్వర్యంలో నిర్వహించిన రచయితల వర్క్‌షాప్-2026లో రూపొందించిన ప్రజా పాలన పాటలు, వీధి నాటకాలు, పల్లెసుద్దులను పుస్తక రూపంలో తీసుకువస్తున్న సందర్భంగా ఆ పుస్తక కవర్ పేజీని రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ మరియు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరాలంటే సాంస్కృతిక సేన సభ్యులు తమ ఆటపాటలు, రచనల ద్వారా సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ప్రచారం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం రోజుకు 18 గంటల పాటు కష్టపడి పనిచేస్తున్నారని, రాబోయే రోజుల్లో తెలంగాణ అభివృద్ధిలో మరింత ముందంజలో నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా సాంస్కృతిక సేనా అధ్యక్షుడు గడ్డం సుధాకర్, జిల్లా కోశాధికారి జన్ను శివకృష్ణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మీసాల ప్రకాష్ పాల్గొన్నారు.



# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడమే ఎంజీఎం వైద్యుల బాధ్యత: మంత్రి కొండా సురేఖ

బెస్ట్ వాయిస్,వరంగల్:

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా వారి నమ్మకాన్ని నిలబెట్టడం ఎంజీఎం వైద్యుల బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేసి విధుల్లో అందుబాటులో ఉండాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. ఎంజీఎం ఆసుపత్రిలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, సిబ్బంది కొరత, ఆధునిక వైద్య పరికరాల అవసరాలు, ఆరోగ్యశ్రీ రివాల్వింగ్ ఫండ్, నర్సింగ్ పాఠశాల భవనం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఎంజీఎం అభివృద్ధి కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పోస్టులు, అత్యవసర విభాగంలో రద్దీ, ఆధునిక వైద్య పరికరాల కొరత, పెండింగ్ బిల్లులు, పీఎంఎస్ఎస్‌వై ఆసుపత్రి నిర్వహణ సమస్యలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఎంజీఎంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన నిధులు, పరికరాల సమీకరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నర్సింగ్ స్కూల్ భవనం సమస్య, ఆసుపత్రి మౌలిక వసతుల అభివృద్ధి, పరికరాల మరమ్మతులు, సిబ్బంది భర్తీ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేసి సేవల మెరుగుదలకు చర్యలు చేపట్టామని పేర్కొన్న మంత్రి, గతంతో పోలిస్తే ఎంజీఎంలో వైద్య సేవలు మెరుగుపడ్డాయని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడంలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం



చేశారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అతిపెద్ద ప్రభుత్వ వైద్య సంస్థగా ఎంజీఎం నిరుపేదలకు ఆపద్బాంధవుడిగా నిలుస్తోందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం హెచ్‌డీఎస్ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పీఎంఎస్ఎస్‌వై పథకం కింద మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. న్యూరో సర్జరీల సంఖ్య తగ్గడంపై ఆరా తీసిన ఎంపీ, ఆ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వైద్యులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు నమోదు చేసి విధుల్లో అందుబాటులో ఉండాలని, రోగుల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, ఎంజీఎం మరియు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు నైపుణ్యం కలిగిన వైద్యులను నియమించాలని సూచించారు. ఆసుపత్రి ప్రధాన గేటు నుంచి భవనం వరకు రోగుల రాకపోకల కోసం సీఎస్ఆర్ నిధులతో బ్యాటరీ రిక్షాలు లేదా ఇతర రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ఆసుపత్రుల ప్రక్షాళన, అభివృద్ధి, నాణ్యమైన వైద్య సేవలందించడంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. మౌలిక వసతులు, మానవ వనరులు, పరిపాలనా అంశాలపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశం అనంతరం మంత్రి కొండా సురేఖ ఎంజీఎం ఆసుపత్రిలోని ఏఎంసీ కేర్ సెంటర్‌ను సందర్శించి రోగులను పరామర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, వైద్యుల పనితీరును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రరెడ్డి, వైద్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# భూముల విలువకు రెక్కలు

తరువాయి భాగం

కొన్నిచోట్ల నూరుశాతం వరకు పెరిగినట్లు సమాచారం. హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో పెంపుదల 1020 శాతం మాత్రమే ఉన్నట్లు సమాచారం. భూముల ధరలు అధికంగా ఉన్న జూబ్లీహిల్స్ లాంటి ప్రాంతాల్లో ఇప్పటికే చదరపు గజం మార్కెట్ విలువ రూ.80 వేలుగా ఉంది. దీన్ని రూ.90 వేలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తెల్లాపూర్, శంషాబాద్ తదితర ఓఆర్ఆర్‌కి అటూ.. ఇటూ.. ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రస్తుతం చాలా తక్కువగా ఉంది. వ్యవసాయ భూములకు సంబంధించి దీన్ని 100% పెంచనున్నారు. ఉదాహరణకు ఒకచోట మార్కెట్ విలువ ఎకరాకు రూ.30 కోట్లు ఉంటే బహిరంగ మార్కెట్లో దానికి మూడింతల ధర ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 100 శాతం పెంచినట్లు తెలుస్తోంది. వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూముల విలువలు 5070 శాతం వరకు పెరగనున్నాయి. కరీంనగర్ గ్రామీణ ప్రాంతాల్లో భూముల విలువ అధికంగా ఉంది. ఇప్పటికే ఎక్కువగా ఉన్నచోట స్వల్పంగా మాత్రమే పెంచనున్నారు. ఉదాహరణకు రూ.30 లక్షలున్న ఎకరా ధరను రూ.35 లక్షలకు.. రూ.60 లక్షలున్నచోట రూ.70 లక్షలకు సవరించినట్లు సమాచారం. ఓఆర్ఆర్ వెలుపలి ప్రాంతాల్లో రూ.20 లక్షలున్నచోట రూ.40 లక్షలు చేసినట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఇబ్రహీంపట్నం ప్రాంతంలో కొన్నిచోట్ల ఎకరా మార్కెట్ విలువ రూ.20 లక్షలు రూ.75 లక్షల మధ్య ఉంది.. దాన్ని 100% పెంచితే రూ.40 లక్షల నుంచి రూ.కోటీ 50 లక్షల వరకు పెరగనుంది. కోకాపేట తదితర ప్రాంతాల్లో ఎకరా విలువ రూ.4 కోట్లు ఉండగా రూ.8 కోట్లకు సవరించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ నగర పరిధిలో అపార్టుమెంట్ల విలువ 20% మాత్రమే గరిష్ఠంగా పెరగనుంది. కొన్నిచోట్ల దీన్ని 10 శాతానికే పరిమితం చేసినట్లు తెలుస్తోంది. ఉప్పల్, బండ్లగూడ, హబ్సిగూడ, కొత్తపేట, నాచారం తదితర ప్రాంతాల్లో ప్రస్తుత మార్కెట్ విలువ చదరపు అడుగుకు రూ.2,500గా ఉంది. ఇది రూ.3,000కు పెరగనున్నట్లు సమాచారం. దారుస్సలాంలో ప్రస్తుతం ప్రభుత్వ మార్కెట్ విలువ గజం రూ.32,200గా, అపార్టుమెంట్లలో చదరపు అడుగు రూ.4 వేలుగా ఉంది. అధ్యయనంలో అక్కడి వాస్తవ విలువ గజం రూ.1,20,000, చదరపు అడుగు రూ.11 వేలుగా ఉన్నట్లు వెల్లడైంది. దీంతో తాజాగా సవరించిన మేరకు.. చదరపు గజం రూ.50 వేలుగా, చదరపు అడుగు రూ.5 వేలుగా నిర్ణయించినట్లు సమాచారం. వనస్థలిపురంలోని కోదండరాంనగర్ కాలనీలో ప్రస్తుత మార్కెట్ విలువ గజం రూ.20,300గా ఉంది. ప్రభుత్వ అధ్యయనంలో ప్రైవేటు విలువ రూ.40 వేలుగా ఉన్నట్లు కమిటీ నిర్ధారించింది. దీంతో అక్కడ గజం విలువను రూ.25 వేలుగా ఖరారు చేసినట్లు తెలిసింది. మండల కేంద్రాల్లోనూ విలువలు పెరిగాయి. చాలామేర గ్రామాల్లోని ప్లాట్లు, వ్యవసాయ భూములకు సంబంధించి ఎలాంటి మార్పు లేకుండా ప్రస్తుత విలువలనే కొనసాగించనున్నారు.

# తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..

తరువాయి భాగం

వెళ్లిపోయాయి. అదే సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి మేము మద్దతు ఇచ్చాము' అని కేటీఆర్ గుర్తు చేశారు. 'పవన్ కళ్యాణ్‌ను ఉప ముఖ్యమంత్రిగా గౌరవిస్తాం, నటుడిగా అభిమానిస్తాము. పవన్ ఇంటికి వస్తే బిర్యానీ పెట్టి మర్యాద చేస్తాం. కానీ మా సచివాలయంలో కూర్చొని తెలంగాణ గురించి తక్కువ చేసి మాట్లాడితే ఊరుకోం. పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా చేశారు. తెలంగాణకు అసలైన ఓజీ కేసీఆర్. తెలంగాణ ఒక్క ఓజీ చాలు, ఇంకొకరు అసవరం లేదు. తెలంగాణ రాష్ట్రం సులభంగా వచ్చినది కాదు. వేలాది మంది త్యాగాలు, దశాబ్దాల ఉద్యమ ఫలితంగా రాష్ట్రం ఏర్పడింది. పవన్ కళ్యాణ్ అయినా, మరెవరైనా దేశంలో ఎక్కడైనా పోటీ చేయవచ్చు. అయితే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవించాల్సిందే. తెలంగాణ భూమిపుత్రుల జాగీరే. ఈ రాష్ట్రం కోసం జరిగిన పోరాటాన్ని ఎవరూ తక్కువ చేసి చూడలేరు' అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

# సోషల్ మీడియాలో హల్‌చల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ తన అందచందాలతో సోషల్ మీడియాలో ఎప్పడూ సెన్సేషన్ క్రియేట్ చేస్తూనే ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని క్యాజువల్ అండ్ హాట్ ఫోటోషూట్ పిక్స్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. "హౌ ఇట్స్ గోయింగ్, జూన్" అంటూ జూన్‌కు వెల్‌కమ్ చెబుతూ ఆమె షేర్ చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది..ఈ ఫోటోలలో ప్రగ్యా లూజ్ హెయిర్‌తో, కిల్లర్ లుక్స్‌తో కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.తాజా ఫోటోషూట్‌లో ప్రగ్యా జైస్వాల్ చాలా సింపుల్ అండ్ స్టైలిష్ లుక్‌లో కనిపించింది. ఇక నేచురల్ బెల్ట్ లేదా న్యూడ్ టోన్ బాడీసూట్ టాప్‌పై.. వైట్ కలర్ లాంగ్ స్లీవ్ షర్టును బటన్స్ విప్పేసి భుజాలపై లూజ్‌గా వేసుకుంది. దానికి కాంబినేషన్‌గా డిస్ట్రెస్డ్ బ్లూ డెనిమ్ షార్ట్స్ ధరించి, నేలపై కూర్చొని డిఫరెంట్ ఫోజులిచ్చింది. మెస్సీ హెయిర్ స్టైల్, లైట్ మేకప్‌తో ఆమె ఇచ్చిన గ్లామర్ ట్రీట్‌కు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు.ప్రగ్యా జైస్వాల్ ట్రెడిషనల్ చీర కట్టినా.. లేదా మోడ్రన్ బికినీలు, బ్లాక్ డ్రెస్‌లు వేసినా ఆమె పర్ఫెక్ట్ బాడీ షేప్ ఎప్పడూ హైలెట్ అవుతుంటుంది. ఇంతటి పర్ఫెక్ట్ ఫిజిక్‌ను కాపాడుకోవడానికి ప్రగ్యా రోజువారీ జీవితంలో చాలా కష్టపడుతుంది. ఆమె క్రమం తప్పకుండా జిమ్‌లో కఠినమైన వర్కౌట్లు చేయడంతో పాటు యోగా, స్విమ్మింగ్‌ను అస్సలు మిస్ అవ్వదు. అందుకే ఆమె అంత ఫిట్‌గా, గ్లామరస్‌గా కనిపిస్తుంది.ఇక గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రగ్యా.. 2014లో సినీ రంగ ప్రవేశం చేసింది. వరుణ్ తేజ్‌తో కలిసి నటించిన 'కంచె' చిత్రం ద్వారా టాలీవుడ్‌లో గుర్తింపు పొందిన ఆమె, ఆ సినిమాతోనే ఫిలింఫేర్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. ఇక ఆ తర్వాత బాలకృష్ణతో చేసిన 'అఖండ' ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. రీసెంట్‌గా 2024లో 'ఖేల్ ఖేల్ మే', 2025లో వచ్చిన 'డాకు మహారాజ్' సినిమాలతో ప్రేక్షకులను అలరించింది.ప్రస్తుతం ప్రగ్యా చేతిలో బాలయ్యతో 'అఖండ 2', అలాగే 'టైసన్ నాయుడు' వంటి క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సోషల్ మీడియా ద్వారా అభిమానులకు ఎప్పటికప్పుడు గ్లామర్ ట్రీట్ ఇస్తూనే ఉంటుంది. ఇక జూన్ నెలను ఇంత హాట్‌గా స్టార్ట్ చేసిన ప్రగ్యా.. రాబోయే రోజుల్లో తన సినిమాలతో ఇంకెన్ని వండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



Printed, Published & Owned by Kowdagani Jyothi Printed at VM Printers H.No. 8-10-37, Radhika Theatre, Warangal.Telangana- 506002. Published at # 16-1-558/2 SRR Thota,Kareemabad, Warangal. Telangana -506002. Editor: Kowdagani Mohan Rao, RNI No.TELTEL/2016/68994. Cell:9963334550, email: bestvoicenews@gmail.com